ఆగస్టు 24 నుంచి నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజావాణి




PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు బీఎస్పీ పూర్తి మద్దతు.




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 236 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 21 ఆగస్టు 2026

## హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

- హాజరైన ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు




**మహాబలిపురం,ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం మహాబలిపురంలో జరిగింది. ఈ సమావేశంకు ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు

మిగతా2లో...

# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

● దక్షిణాది అభివృద్ధి చెందితేనే.. దేశాభివృద్ధి పరుగులు ● కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు చేయూత ● పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మహాబలిపురం,ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు కూడా న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అని ఆయన పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటుగా ఆంధ్రప్రదేశ్

మిగతా2లో...



## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

- నిషేధిత జాబితాకు పొంగులేటిదే బాధ్యత
- బిజెపి ఎంపి లక్ష్మణ్ డిమాండ్

**న్యూఢిల్లీ,ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఎవరు చెప్తే భూములను నిషేధిత జాబితాలో పెట్టారో మంత్రి పొంగులేటి చెప్పాలన్నారు. తెలంగాణలో ప్రజాపాలన లేదని.. దోపిడి పాలన ఉందని విమర్శించారు.

మిగతా2లో...

## రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

వీర్‌భూమి వద్ద నివాళి అర్పించిన సోనియా కుటుంబం

ఎక్స్ వేదికగా రాజీవ్‌ను స్మరించుకున్న ప్రధాని మోడీ




## ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం

డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా కార్యక్రమం

కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయాను మంత్రి వాకిటి శ్రీహరి ఆహ్వానం




## 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం..

కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం

ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదు

అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



**హైదరాబాద్,ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** 22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి గారు స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్,

మిగతా2లో...



## పాలిటెక్నిక్‌ల విలీనంపై అపోహలు తగవు

నైపుణ్య శిక్షణ అందించాలన్నదే ప్రభుత్వ ఆలోచన

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్,ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్‌ల విలీనంపై నెలకొన్న అపోహలకు మంత్రి వివేక్ వెంకటస్వామి తెరదించారు. స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనంపై కొందరు అపోహలు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. పాలిటెక్నిక్‌లను మరింత అప్‌గ్రేడ్ చేసి, విద్యార్థులకు మెరుగైన నైపుణ్య శిక్షణ అందించాలనే ఉద్దేశంతోనే వాటిని స్కిల్ యూనివర్సిటీ

మిగతా2లో...

## అర్ధరాత్రి బావిలోకి దూసుకెళ్లిన కారు

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి



**సిద్దిపేట,ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈవిషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక మండలంలోని బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో వస్తుండగా బుధవారం అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బావిలో పడిపోయారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో బావిలో నుంచి కారును, నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

రాహుల్ గాంధీకి హరీష్ రావు లేఖ



**హైదరాబాద్,ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో 22ఎ నిషేధిత జాబితా భూముల సెక్షన్ దుర్వినియోగంపై రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో ఊఓఆం అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను 22ం జాబితాలో పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖలో 30 శాతం వసూళ్ల దందా సాగుతుంది. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు 30? కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

మిగతా2లో...

## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

అందుకు తనను బాధ్యులు చేయడం తగదు క్రమశిక్షణ లేఖను ఉపసంహరించుకో వాలన్న కొండా సురేఖ



# సమస్యల పరిష్కారమే అసలైన సమాఖ్యవాదం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళం ముఖ్యమంత్రి వీడీ సతీషన్, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇతర కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ప్రస్తావించారు. బలమైన నిర్మాణానికి ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని అన్నారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలని పేర్కొన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభ కోసం రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనని ఆయన చెప్పుకొచ్చారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని డిప్యూటీ సీఎం చెప్పారు.సమస్యలు రాష్ట్ర సరిహద్దులను ప్రభుత్వ ÷ళ్లై కంటే వేగంగా దాటుతాయి భట్టి చమత్కరించారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను తెలంగాణ కచ్చితంగా కోరుకుంటోందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్?ఎఎ పరిధిలో ఉందని ఆయన గుర్తు చేశారు. చట్టపరమైన పక్రియ ద్వారా త్వరగా సమస్యకు పరిష్కారం కనుగొనాలని ఆయన చెప్పారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో భట్టి విక్రమార్క మరోసారి స్పష్టంగా చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు కూడా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014 అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఈ సమస్యలకు తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగించడం కాదని, ప్రతి కొన్ని సంవత్సరాలకు కొత్త అర్థాలు, వివరణలు ఇవ్వడం కూడా కాదని ఆయన వ్యాఖ్యానించారు. పెండింగ్ అంశాలు ఇకపై తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలని తెలంగాణ కోరుకుంటోందని అన్నారు. షెడ్యూల్ లోని ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సమర్పించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం?2014కు సంబంధించి సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపింది. సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావాలని కోరుకుంటున్నప్పటికీ, అది తప్పనిసరిగా చట్టపరమైన వ్యవస్థ పరిధిలోనే ఉండాలని స్పష్టంగా చెప్పారు. షెడ్యూల్?చీ సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజనను ఆంధ్రప్రదేశ్ కోరుతోందని, అయితే పునర్వ్యవస్థీకరణ చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేదని ఆయన చెప్పారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన పక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు.

## 22ఏ సమస్యపై ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం..

(మొదటి పేజీ తరువాయి)

వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ÷ూల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 2ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమ వుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి‘ అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

## తెలంగాణలో దోపిడీ పాలన సాగుతోంది

(మొదటి పేజీ తరువాయి)

భూదందాలు చేస్తూ ప్రజల భూములను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు నిషేధిత జాబితాలో చేరిందన్నారు. ప్రజలు కష్టపడి సంపాదించిన భూములు నిషేధిత జాబితాలో పెట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా నడిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణలు చెప్పడం సిగ్గు చేటని ఎంపీ అన్నారు. అధికారులను బాధ్యులుగా చేయడం కాదని.. దీనికి ఆదేశించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 22 ఏ జాబితాను బహిర్గతం చేయాలన్నారు. ప్రజల పక్షాన బీజేపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. 22 ం భూములపై సీబీఐ విచారణకు ఆదేశించాలని.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. భూములు నిషేధిత జాబితాలో పెట్టారని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి బహిరంగ వ్యాఖ్యలు చేశారని అన్నారు. తెలంగాణలో భూముల పేరుమీద కుంభకోణాలు, సెటిల్మెంట్, దందాలు బయట పడుతున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కాజేయాలని చూస్తే రేవంత్ రెడ్డి పీసీసీగా ఉండి పోరాటం చేశారని.. భూములు కాపాడుతామని చెప్పారని గుర్తుచేశారు. ధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని రేవంత్ అన్నారని లక్ష్మణ్ తెలిపారు. గత బీఆర్ఎస్ హయాంలో 22 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో అంటే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కోటి ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టిందని విమర్శించారు. వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని మంత్రులు దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు గుప్పించారు.

## ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనండి

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు / క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ వీసీ / ఎండీ సోనిబాలాదేవి న్యూఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో మెరుగైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి తెలంగాణను దేశ క్రీడా పటంలో మరింత బలమైన రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ల్గ÷లో ఇండియా కార్యక్రమ నిర్వహణ కోసం తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను మంత్రి వాకిటి శ్రీహరి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణలో 22ఎ సెక్షన్ దుర్వినియోగం

(మొదటి పేజీ తరువాయి)

22ంపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. దీనిపై వెంటనే స్వతంత్ర విచారణకు రేవంత్ ప్రభుత్వం ఆదేశించాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు అని లేఖలో పేర్కొన్నారు.
సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

## సుష్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతం

**హైదరాబాద్,ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గురువారం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఆమె లేఖ రాశారు. ఈ సందర్భంగా తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తన కుమార్తె అయినంత మాత్రాన.. ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని స్పష్టం చేశారు. సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ అంశంలో తన ప్రమేయం లేదని గుర్తించాలని కమిటీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా క్రమశిక్షణా కమిటీని మంత్రి కొండా సురేఖ కోరారు. వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను ఆమె అభిమానులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె కుమార్తె సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుస్మిత మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పరకాల నుంచి తాను బరిలో దిగుతానని ప్రకటించారు. పార్టీ అధిష్ఠానం తనకు టికెట్ ఇవ్వకున్నా.. ఇండిపెండెంట్‌గా బరిలో దిగుతానని వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిపై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు.సుస్మిత వ్యాఖ్యలు మీడియా, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో సుస్మితా పటేల్ వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయింది. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్.. ఈ అంశంపై నివేదిక ఇవ్వాలని పీసీసీని కోరింది. అలాగే క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి కూడా స్పందించారు. దీనిపై మంత్రి కొండా సురేఖను వివరణ కోరతామని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ రాశారు.

## రాజీవ్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నివాళి

**న్యూఢిల్లీ,ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్ చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించబడుతుందని కాంగ్రెస్ పేర్కొంది. అలాగే, దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీ ప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోదీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోదీ స్మరించు కున్నారు. 'భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు' అంటూ ఎక్స్ వేదికగా మోదీ పోస్టు చేశారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ జరుపుకుంటారు. ఇందులో జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, యు వతపై దృష్టి, లౌకికవాదం వంటి అంశాలు ఉన్నాయి. విభిన్న వర్గాల మధ్య ఐక్యతను బలోపేతం చేయడం, కుల, మత, జాతి భేదాలకు అతీతంగా సోదరభావాన్ని పెంపొందించడం.. ఆధునిక, సమ్మిళిత దేశ నిర్మాణానికి దోహదపడేలా భారతీయ యువతను ప్రేరేపించడం వంటివి రాజీవ్ గాంధీ దార్శనికతలో భాగం. అంతేకాకుండా, భిన్నత్వంలో ఏకత్వం అనే భారతదేశ సంప్రదాయా లు, విలువలను నిలబెట్టడానికి ఆయన కృషి చేశారు. కాగా, ఇందిరా గాంధీ హత్య అనంతరం 1984వ సంవత్సరంలో భారతదేశానికి 40 ఏళ్ల వయసులో రాజీవ్ గాంధీ 6వ ప్రధానమంత్రి అయ్యారు.

## హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి (సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాల ని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానించడంతోపాటు దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు ప్రతిపాదించిన చేసారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరిన ముఖ్యమంత్రి దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్నారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్న సీఎం, విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు. కావేరి నదుల అనుసంధా నంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదన చేసిన సీఎం, గోదావరి, కావేరి అనుసంధానంతో తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వ్యాఖ్యానించారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి నదీ జలాలపై సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. గంగా, కావేరి నదుల అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక అవసరం అన్న చంద్రబాబు, నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలన్నా రు. సీఎం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాన్ని కొనియాడిన దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు దక్షిణాది రాష్ట్రాల సమగ్రాభివృద్ధి గురించి ఎంతో విజన్ తో మాట్లాడారని పేర్కొన్నారు. విశాల దృక్పథంతో అన్ని రాష్ట్రాల అభివృద్ధి గురించి మాట్లాడారని ప్రశంసించారు కర్ణాటక సీఎం డీకే శివకుమార్.

## పాలిటెక్నిక్‌ల విలీనంపై అపోహలు తగవు

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. బ్లూ కాలర్ ఉద్యోగాల్లోనూ తెలంగాణ యువత ముందుండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పాలిటెక్నిక్ కాలేజీల లెక్చరర్లు, సిబ్బంది ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతారని, వారి సర్వీసు భద్రతకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. డిప్యూటేషన్, బదిలీల విధానంలోనూ ఎలాంటి మార్పులు ఉండవని చెప్పారు. స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసినప్పటికీ పాలిటెక్నిక్ ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదని, విద్యార్థులు ఈసెట్ ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో లేటరల్ ఎంట్రీ పొందే విధానం యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. అలాగే పాలిసెట్‌ను కూడా కొనసాగిస్తామని తెలిపారు.

పాలిటెక్నిక్ విద్యార్థు లు, లెక్చరర్లకు విలీనంతో మరిన్ని ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. విద్యార్థులకు రూ.2 వేల స్టైఫండ్ అందించే అంశంపై కూడా కసరత్తు చేస్తున్నామని చెప్పారు. వరంగల్‌లో విద్యార్థి పట్ల అనుచితంగా ప్రవర్తించిన సీఐపై చర్యలు తీసుకుని బదిలీ చేశామని తెలిపారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలిటెక్నిక్ కాలేజీలను పట్టించుకోలేదని విమర్శించారు. విద్యార్థుల ఆందోళనల వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందని ఆరోపించిన మంత్రి.. రాజకీయ పార్టీల తప్పుడు ప్రచారాన్ని విద్యార్థులు, ఉద్యోగులు నమ్మవద్దని సూచించారు. శక్తి శాఖ పేరును కార్మిక శాఖగా కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు వస్తున్నాయని, శాఖ పేరులో 'కార్మిక' పదం కూడా ఉండేలా మార్పులు చేసే ఆలోచన ఉందని వెల్లడించారు.

## భద్రాచలం ఐదు గ్రామాలు తెలంగాణలో కలపాలి: మంత్రి తుమ్మల

**హైదరాబాద్,ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర విభజన అనంతరం పెండింగ్‌లో ఉన్న తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలను కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నించింది.

గురువారం మహాబలిపురంలో కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాలుగు ప్రధాన అంశాలపై కేంద్రం, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని, పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధరణకు ఏపి వాటా నిధులు విడుదల చేయాలని, ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని, భద్రాచలం, ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రాన్ని కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలం పరిసరాల్లోని యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని తుమ్మల కోరారు.

ఈ ఐదు పంచాయతీల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా, వాటి మొత్తం భౌగోళిక విస్తీర్ణం 11,122.01 ఎకరాలు అన్నారు. 2024 జూలై 18న భారీ వర్షాలకు దెబ్బతిన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెద్దవాగు ప్రాజెక్టును శాశ్వతంగా పునరుద్ధరించేందుకు రూ.92.20 కోట్లు అవసరమని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 16 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, మొత్తం ఆయకట్టులో 85.25 శాతం(13,640 ఎకరాలు) ఏపి పరిధిలోనే ఉందన్నారు.శాశ్వత పునరుద్ధరణ వ్యయాన్ని ఆయకట్టు నిష్పత్తి ప్రకారం రెండు రాష్ట్రాలు భరించాలని, ఏపీ తన వాటా నిధులను వెంటనే విడుదల చేయాలని చంద్రబాబును కోరారు. గత ఫిబ్రవరిలోనే విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్ణయం పెండింగ్‌లో ఉందని, రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఆలస్యం చేయరాదని తెలిపారు.

# ఆగస్టు 24 నుంచి నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజావాణి

**ప్రజలు తమ అర్జీలనుం నూతన ఐడీఓసీలోనే అందజేయాలి**

**ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి**

**జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు జిల్లా, ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఇకపై నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ)లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.**ఆగస్టు 24 నుంచి కొత్త వేదికలో ప్రజావాణి** ఆగస్టు 24వ తేదీ సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమాన్ని ములుగు గట్టమ్మ సమీపంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన నూతనంగా నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఐడీఓసీ గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఎడమ వైపున ఉన్న సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.ప్రజలు తమ సమస్యలు, వినతులు, వివిధ ప్రభుత్వ సేవలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించేందుకు ఇకపై నూతన ఐడీఓసీ కార్యాలయానికే రావాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగుతుందని తెలిపారు.**ఒకే ప్రాంగణంలో ప్రభుత్వ సేవలు**ప్రజలకు వివిధ ప్రభుత్వ శాఖల సేవలను ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.వివిధ జిల్లా స్థాయి ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఒకేచోట ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలు తమ పనుల కోసం వేర్వేరు ప్రాంతాల్లోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ సేవలను సులభంగా పొందే అవకాశం కలిగిందన్నారు.**ప్రజలకు అనుకూలమైన వసతులతో ఐడీఓసీ**నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో విశాలమైన కార్యాలయ గదులు, సమావేశ మందిరాలు, ప్రజలకు అనుకూలమైన వసతులను ఏర్పాటు చేసినట్లు బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. జిల్లా పరిపాలనకు నూతన ఐడీఓసీ కేంద్రబిందువుగా నిలిచేలా తీర్చిదిద్దినట్లు చెప్పారు.ఈ నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ఆగస్టు 16వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు.**మార్పును ప్రజలు గమనించాలి** ప్రజావాణి వేదిక మారిన విషయాన్ని ప్రజలు గమనించి, తమ సమస్యలు, వినతులు, దరఖాస్తులను నూతన ఐడీఓసీ కార్యాలయంలోనే సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఆగస్టు 24వ తేదీ సోమవారం నుంచి ఐడీఓసీ గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఎడమ వైపున ఉన్న సమావేశ మందిరంలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.

# బోనాల సందర్భంగా జర్నలిస్టులకు ఘన సన్మానం

- ఉప్పల్ శ్రీ మహంకాళి దేవస్థానం చైర్మన్ తెల్కల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం





**ఉప్పల్ ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** బోనాల పండుగను పురస్కరించుకుని ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ మిత్రులకు ఉప్పల్ శ్రీ మహంకాళి దేవస్థానం చైర్మన్ తెల్కల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానం చేశారు. జర్నలిస్టులకు శాలువాలు కప్పి సత్కరించి, బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా తెల్కల మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు, సమాజానికి సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ , ప్రధాన కార్యదర్శి ఆనంద నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు ఇడపాక సురేష్, బోడ ప్రవీణ్, కదుకూరి ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు యాకూబ్ పాషా, నెమ్మది వెంకన్న, దేవాతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో బీఆర్ఎస్ నాయకుడి కారుపై దాడి

- కాంగ్రెస్ నాయకుల అనుచరులే దాడికి పాల్పడ్డారంటూ ఆరోపణ
- జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ చక్రపాణి






**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** తాడ్వాయి మండలం కొండపర్తి సమీపంలో బీఆర్ఎస్ నాయకుడు, మల్లంపల్లి మండలానికి చెందిన మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ చక్రపాణి ప్రయాణిస్తున్న కారుపై దాడి జరిగినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లి తిరిగి ములుగు వస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు చక్రపాణి తెలిపారు.తన కారును కొందరు వ్యక్తులు అడ్డుకుని దాడికి పాల్పడ్డారని, ఈ క్రమంలో కారు అద్దాలను ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. ఈ దాడి వెనుక కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అనుచరులు ఉన్నారని చక్రపాణి ఆరోపించారు.దాడిలో హైదరాబాద్‌కు చెందిన విక్రమ్, జగిత్యాల జిల్లాకు చెందిన రఘు, తాడ్వాయి మండలం కొండపర్తికి చెందిన లచ్చు పటేల్ తదితరులు పాల్గొన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. దాడి నుంచి తాను ప్రాణాపాయం నుంచి బయటపడ్డానని చక్రపాణి తెలిపారు.ఘటన అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ములుగు జిల్లా ఎస్పీని చక్రపాణి కలసి ఫిర్యాదు చేశారు. రాజకీయ కక్షతోనే తనపై దాడి జరిగినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. నిందితులపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని ఆయన పోలీసులను కోరినట్లు తెలిసింది.చక్రపాణి ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. అయితే దాడికి గల పూర్తి కారణాలు, ఘటనలో ఎవరి ప్రమేయం ఉందన్న విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# సీరోల్ మండల కేంద్రంలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**రాజీవ్ గాంధీ ఆశయాలే దేశానికి స్ఫూర్తి : ఇస్లావత్ సుధాకర్ నాయక్**





**సీరోల్, ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను సీరోల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆధునిక భారత నిర్మాణానికి ఆయన వేసిన బాట, యువతకు ప్రాధాన్యత కల్పించిన విధానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు.అనంతరం కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలకు పంపిణీ చేశారు. రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో సీరోల్ మండల కాంగ్రెస్ నాయకులు,సీరోల్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఉప్పరగూడెం సర్పంచ్ మల్లికంటి సురేష్, చిలుకోయలపాడు సర్పంచ్ ఊడుగుల వెంకన్న, చిలుక్కోయాలపాడు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలిన రవికుమార్, ఉపాధ్యక్షులు బానోత్ పాప, వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి వీరేష్ ,యువజన నాయకుడు అంగోత్ సురేష్ నాయక్ ,వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, యువజన నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు బీఎస్పీ పూర్తి మద్దతు.







**- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్...**

**- ఐదో రోజుకు చేరిన నిరసన దీక్ష..**

**- నల్ల బెలూన్లు ఎగరేసి జర్నలిస్టుల వినూత్న నిరసన...**

**హుజూరాబాద్, ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):**హుజూరాబాద్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన కోసం సాగుతున్న న్యాయపోరాటం, సామాజిక ఉద్యమానికి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన శాంతియుత నిరసన దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్,బి ఎస్పీ నాయకులు,ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక సమ్మయ్య సందర్శించి జర్నలిస్టుల పోరాటానికి సంఘీభావం తెలిపారు. **కలిసికట్టుగా పోరాడితేనే హక్కుల సాధన...**ఈ సందర్భంగా పల్లె ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ.. హక్కుల సాధనకు ఐక్య పోరాటమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. 'చలి చీమలు ఏకమై పెద్ద పామును సైతం అంతమొందించినట్లుగా' జర్నలిస్టులంతా ఏకతాటిపై నిలిచి పోరాడాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల నిరంతర ప్రజాసేవను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా ఈ ప్లాట్లను మంజూరు చేసిందని, ఇవి ఏ ఒక్క రాజకీయ పార్టీయో ఇచ్చినవి కావని గుర్తుచేశారు. రాజకీయ వైషమ్యాలు ఏవైనా ఉంటే ఎన్నికల బరిలో తేల్చుకోవాలే తప్ప, ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేయడం హేయమైన చర్య అని కాంగ్రెస్ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.**కలాలకు ఈ దుస్థితి రావడం విచారకరం...** నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తి, పాలకుల దృష్టికి తీసుకెళ్లే కలాలే నేడు తమ కనీస హక్కుల కోసం రోడ్డెక్కి దీక్షలు చేయాల్సి రావడం బాధాకరమన్నారు.జర్నలిస్టుల న్యాయమైన సమస్యలపై స్పందించని నాయకులు, రాజకీయ పార్టీల వార్తలను పూర్తిగా బహిష్కరించాలని సూచించారు. జర్నలిస్టుల సహాయ నిరాకరణను ఎదుర్కొని ఏ నాయకుడూ రాజకీయంగా మనుగడ సాగించలేరని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ప్రణవ్ కేవలం ముఖ్యమంత్రికి, అధిష్టానానికి శుభాకాంక్షలు తెలపడానికే పరిమితం కాకుండా, ఈ వివాదాన్ని సీఎం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని డిమాండ్ చేశారు. **జర్నలిస్టుల ఉద్యమాన్ని నీరుగార్చే కుట్ర...: కొలిపాక సమ్మయ్య**ముదిరాజ్ సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కొలిపాక సమ్మయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి జర్నలిస్టుల న్యాయమైన ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కృత్రిమ ఉద్యమాలను సృష్టిస్తూ పన్నాగం పన్నుతున్నారని మండిపడ్డారు. ఇప్పల నర్సింగాపూర్, దమ్మక్కపేట గ్రామాల ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ, జర్నలిస్టులకు కేటాయించిన స్థలాలు గ్రామానికి చెందినవంటూ వారిలో విషబీజాలు నాటే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాల ప్రజలు ఆయన మాయమాటలను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. **హోరెత్తిన నినాదాలు.. నల్ల బెలూన్లతో నిరసన...** ఐదో రోజు నిరసనలో భాగంగా జర్నలిస్టులు ఆకాశంలోకి నల్ల బెలూన్లను ఎగురవేసి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. డప్పు చప్పుళ్లతో కాంగ్రెస్ నేత గూడూరు స్వామి రెడ్డి వైఖరికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. తక్షణమే జర్నలిస్టుల స్థలాలపై వేసిన కోర్టు కేసును ఉపసంహరించుకోవాలని, "మా స్థలాలు మాకు ఇవ్వాలి..

మా హక్కులు కాపాడాలి" అంటూ నినదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కళాకారుల ఆటపాటలు, గేయాలు దీక్షా శిబిరంలో పాల్గొన్న వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు, బీఎస్పీ నాయకులు గిన్నారపు మహేందర్, వేల్పుల మల్లేష్, అంబాల ప్రభాకర్,ఇల్లందుల రమేష్, మంద సమ్మయ్య,దొడ్డ సమ్మయ్య,జేఏసీ నాయకులు వేల్పుల రత్నం , చందుపట్ల జనార్ధన్,ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుసుమ జగదీష్ 50వ జయంతి ఘనంగా నిర్వహణ

**తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలు చిరస్మరణీయం**

**కుసుమ జగదీష్ ఆశయ సాధనకు కృషి చేస్తాం**

**'జేడీ మల్లంపల్లి' పేరును ప్రభుత్వ రికార్డుల్లో అధికారికంగా నమోదు చేయాలి**

**మల్లంపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలి**

**బీఆర్ఎస్ నాయకులు భూక్యా జంపన్న, మాచర్ల ప్రభాకర్**





**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 20 (పీసిడబ్ల్యూ న్యూస్):** దివంగత ములుగు మాజీ జడ్పీ చైర్మన్, తెలంగాణ ఉద్యమ నాయకుడు కుసుమ జగదీష్ 50వ జయంతి వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. మల్లంపల్లి మండల కేంద్రంలోని కుసుమ జగదీష్ నివాసం వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జగదీష్ తల్లిదండ్రులు కుసుమ ఆదినారాయణ, సులోచనలతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు భూక్యా జంపన్న, మాచర్ల ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కుసుమ జగదీష్ చేసిన ఉద్యమ పోరాటాన్ని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో జగదీష్ కీలకంగా పనిచేశారని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజలతో మమేకమైన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.కుసుమ జగదీష్ అకాల మరణం ములుగు ప్రాంత ప్రజలకు, తెలంగాణ ఉద్యమానికి తీరని లోటని వారు పేర్కొన్నారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ప్రజల కోసం ఆయన చేసిన సేవలు, ఉద్యమ స్ఫూర్తి, ఆయన ఆశయాలు ఎప్పటికీ ప్రజల మధ్య సజీవంగా ఉంటాయని అన్నారు. జగదీష్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.**జగదీష్ ఆశయాల సాధనకు కృషి** ములుగు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం కుసుమ జగదీష్ కన్న కలలను సాకారం చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తారని భూక్యా జంపన్న, మాచర్ల ప్రభాకర్ తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతామని స్పష్టం చేశారు.మల్లంపల్లి మండల అభివృద్ధి కోసం జగదీష్ చేసిన కృషిని వారు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ములుగు జిల్లా ఏర్పాటులో భాగంగా మల్లంపల్లి మండల ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారని, మండల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం ప్రయత్నించారని తెలిపారు.**'జేడీ మల్లంపల్లి' పేరును అధికారికంగా నమోదు చేయాలి**కుసుమ జగదీష్ సేవలకు గుర్తింపుగా మల్లంపల్లి మండలానికి లి'జేడీ మల్లంపల్లి'లిగా నామకరణం చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు. అయితే హామీ ఇచ్చి చాలా కాలం గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు కొన్ని పత్రాల్లో మాత్రమే 'జేడీ మల్లంపల్లి' అనే పేరు కనిపిస్తోందని, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, అధికారిక రికార్డుల్లో మాత్రం ఈ పేరును పూర్తిస్థాయిలో నమోదు చేయలేదని అన్నారు.కేవలం కాగితాలపై పేరు ప్రస్తావించడం కాకుండా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసి, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, రెవెన్యూ రికార్డులు, అధికారిక పత్రాలు, సైన్‌బోర్డులు, ఇతర ప్రభుత్వ వ్యవస్థల్లో 'జేడీ మల్లంపల్లి' పేరును అధికారికంగా నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.కుసుమ జగదీష్ చేసిన సేవలకు గుర్తింపుగా ఆయన పేరును మండలంతో అనుసంధానం చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆయన ఉద్యమ స్ఫూర్తి, ప్రజా సేవలను గుర్తుచేసినట్లవుతుందని పేర్కొన్నారు.**మండల కార్యాలయాల ఏర్పాటుకు డిమాండ్**మల్లంపల్లి మండలం ఏర్పడి చాలాకాలం గడుస్తున్నప్పటికీ మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటులో జాప్యం జరుగుతోందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ప్రజలు ప్రభుత్వ సేవల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం, తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర కీలక ప్రభుత్వ కార్యాలయాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మండలానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించి ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.మల్లంపల్లి మండల అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. జగదీష్ ఆశయాలకు అనుగుణంగా మండలంలో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, వ్యవసాయం, ఉపాధి, ప్రభుత్వ కార్యాలయాలు వంటి రంగాల్లో అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు.**విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ** జయంతి వేడుకల్లో భాగంగా మల్లంపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పరీక్ష ప్యాడ్‌లను బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని వారు ఆకాంక్షించారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కుసుమ జగదీష్ ప్రజా సేవా స్ఫూర్తిని విద్యార్థుల్లో కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుసుమ జగదీష్ అభిమానులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొని దివంగత నాయకుడికి ఘనంగా నివాళులర్పించారు.

---

# మంత్రి సీతక్క, సూర్యలపై అసంబద్ధ ఆరోపణలు చేస్తే ఊరుకోం

**బీఆర్ఎస్ నేత వై. సతీష్ రెడ్డిపై అంకం సురేష్ ముదిరాజ్ తీవ్రస్థాయి ధ్వజం**

**అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శ**

**సీతక్క, సూర్యలపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని హితవు**




**మల్లంపల్లి మండల ప్రతినిధి, ఆగస్టు 20 (పీసీడబ్ల్యూ న్యూస్):**మంత్రి సీతక్క, ఆమె తనయుడు సూర్యపై బీఆర్ఎస్ నాయకుడు వై. సతీష్ రెడ్డి చేస్తున్న అసంబద్ధమైన, అర్థరహితమైన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని మల్లంపల్లి మండల కేంద్ర ఉప సర్పంచ్, జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అంకం సురేష్ ముదిరాజ్ అన్నారు. రాజకీయ విమర్శలకు కూడా ఒక హద్దు ఉంటుందని, వ్యక్తిగతంగా దూషిస్తూ, నిరాధార ఆరోపణలు చేయడం ఏమాత్రం సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు.ములుగు జిల్లాలో ప్రజాపాలన ద్వారా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అక్కసుతో విమర్శలు చేస్తున్నారని అంకం సురేష్ ఆరోపించారు. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న మంత్రి సీతక్కకు ములుగు జిల్లా ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి కొందరు నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. **ప్రజాదరణ ఉన్న నాయకురాలిని విమర్శించే నైతిక అర్హత ఉందా?** సొంత గ్రామంలో కనీసం ఒక వార్డు సభ్యుడిగా కూడా ప్రజల మద్దతు పొందలేని వ్యక్తి, ప్రజల ఆదరణతో ముందుకు సాగుతున్న మంత్రి సీతక్కను విమర్శించడం విడ్డూరంగా ఉందని అంకం సురేష్ అన్నారు. రాజకీయంగా విమర్శలు చేయాలనుకుంటే ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై మాట్లాడాలని, వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని సూచించారు. **యువత, క్రీడాకారులను ప్రోత్సహిస్తే బెట్టింగ్ మాఫియా అంటారా?** ములుగు జిల్లాలోని గిరిజన యువత, క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు సూర్య ఆధ్వర్యంలో క్రీడా టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారని అంకం సురేష్ తెలిపారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించే కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాల్సింది పోయి వాటిపై బెట్టింగ్ మాఫియా అంటూ ఆరోపణలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆయన మండిపడ్డారు. యువతకు క్రీడా వేదికలు కల్పించడం, ప్రతిభావంతులను ప్రోత్సహించడం సామాజిక బాధ్యత అని, అలాంటి కార్యక్రమాలపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. సతీష్ రెడ్డి తన ఆరోపణలకు ఆధారాలు ఉంటే ప్రజల ముందు వెల్లడించాలని డిమాండ్ చేశారు. **గత బీఆర్ఎస్ పాలనపై అంకం సురేష్ ప్రశ్నలు** గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ములుగు జిల్లాకు ఏం చేశారో బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు వివరించాలని అంకం సురేష్ డిమాండ్ చేశారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో తమ ప్రభుత్వ హయాంలో సాధించిన ప్రగతిని చెప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు.గత ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డులు, ఇళ్లు, పెన్షన్ల కోసం సామాన్య ప్రజలు ఏళ్ల తరబడి ఎదురుచూశారని ఆరోపించారు. నేడు కాంగ్రెస్ ప్రజాపాలనలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. **బహిరంగ చర్చకు సిద్ధమా?** గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఇళ్లు నిర్మించి ఇచ్చింది? ఎంతమందికి కొత్త పెన్షన్లు మంజూరు చేసింది? ఎన్ని రేషన్ కార్డులు ఇచ్చింది? ములుగు జిల్లాకు ఎన్ని అభివృద్ధి పనులు తీసుకొచ్చింది? అనే అంశాలపై బహిరంగ చర్చకు సతీష్ రెడ్డి సిద్ధమా అని అంకం సురేష్ సవాల్ విసిరారు.మంత్రి సీతక్కపై విమర్శలు చేసే ముందు గత ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందిన సంక్షేమాన్ని, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని పోల్చి చూడాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సాధారణ కార్యకర్తతోనైనా ఈ అంశాలపై చర్చకు సిద్ధమైతే ప్రజలే ఎవరి పాలనలో ఏం జరిగిందో నిర్ణయిస్తారని అన్నారు. **సీతక్క, సూర్యలకు ములుగు ప్రజల అండ** మంత్రి సీతక్కపై ఎన్ని రకాలుగా బురదజల్లే ప్రయత్నాలు చేసినా ములుగు జిల్లా ప్రజలు ఆమెను తమ గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తారని అంకం సురేష్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్న సీతక్కకు ప్రజల మద్దతు ఎప్పటికీ ఉంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా యువతను, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ముందుకు సాగుతున్న సూర్యకు కూడా జిల్లా యువత అండగా ఉంటుందని అన్నారు. క్రీడా కార్యక్రమాలను రాజకీయ కోణంలో చూడకుండా యువత భవిష్యత్తు కోసం చేపడుతున్న కార్యక్రమాలుగా చూడాలని కోరారు. **అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోం** స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలను ఇకపై సహించబోమని అంకం సురేష్ ముదిరాజ్ హెచ్చరించారు. మంత్రి సీతక్క, సూర్యలపై నిరాధారమైన ఆరోపణలు చేయడం కొనసాగిస్తే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తగిన రీతిలో స్పందిస్తారని స్పష్టం చేశారు. రాజకీయంగా విమర్శలు చేసుకోవడాన్ని ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ గౌరవించాలని, అయితే వ్యక్తిగత ఆరోపణలు, అసత్య ప్రచారాలకు పాల్పడటం మాత్రం తగదని అన్నారు. ములుగు నియోజకవర్గ ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, స్వార్థ రాజకీయాలకు ప్రజలు తగిన సమయంలో తగిన సమాధానం చెబుతారని అంకం సురేష్ ముదిరాజ్ హెచ్చరించారు.

---

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం





**కల్లూరు, ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** భారత మాజీ ప్రధాని, దివంగత రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని కల్లూరు మండలం నారాయణపురంలోని మంత్రి స్వగృహంలో గురువారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐడీసీ చైర్మన్ మువ్వ విజయ్ బాబు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, కల్లూరు మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, పెద్దబోయిన శ్రీనివాసరావు తదితరులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ దేశంలో ఆధునిక సాంకేతికతకు బాటలు వేసిన దూరదృష్టి కలిగిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడంతో పాటు దేశ అభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు ఆయన చేసిన కృషి దేశానికి ఎంతో మేలు చేసిందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువతకు ఓటు హక్కు కల్పించడం వంటి నిర్ణయాలు ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేశాయని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని మంత్రి అన్నారు. పొంగులేటి యూత్ నాయకులు యాస శ్రీకాంత్, కౌన్సిలర్లు దాసరి సుధారాణి, బీరెల్లి మాధవ్, శీలం కృష్ణారెడ్డి , జిల్లెల్ల భాస్కర్ రెడ్డి, నోటి కృష్ణారెడ్డి, కర్నాటి అప్పిరెడ్డి, కె.వి, రవి పలువురు నాయకులు, కార్యకర్తలు, పొంగిలేటి అభిమానులు పాల్గొన్నారు.

---

# దాడి ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు




**తనను వెంబడించి అడ్డుకుని దాడి చేశారని చందా చక్రపాణి ఆరోపణ**

**ప్రాణహాని ఉందని ఆందోళన..**

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఆగస్టు 20: (పిసిడబ్ల్యూ న్యూస్):** తనను కొందరు వ్యక్తులు వెంబడించి అడ్డుకుని తీవ్రంగా దాడి చేశారని, హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ ములుగు జిల్లా మల్లంపల్లి మండలానికి చెందిన చందా చక్రపాణి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆగస్టు 19న ఎస్పీని కలిసి లిఖితపూర్వక ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు.చందా చక్రపాణి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. వ్యక్తిగత పనుల నిమిత్తం ములుగు ఐటీడీఏ కార్యాలయానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు తనను వెంబడించినట్లు పేర్కొన్నారు. అనంతరం బ్యాంకు పనుల నిమిత్తం వెళ్తున్న సమయంలో తనను అడ్డుకుని దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. తనపై తీవ్రంగా దాడి చేసి ప్రాణహాని కలిగించే విధంగా వ్యవహరించారని ఫిర్యాదులో తెలిపారు.దాడి సమయంలో తన వెంట నర్సంపేట మాజీ సర్పంచ్ ధనావత్ దేవానాయక్ ఉన్నారని, ఆయన ఈ ఘటనను ప్రత్యక్షంగా చూశారని చక్రపాణి పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను సేకరించి సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన కోరారు.**గతంలోనూ బెదిరింపులు** తనపై గతంలోనూ బెదిరింపులు, దాడికి ప్రయత్నాలు జరిగినట్లు చందా చక్రపాణి ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రస్తుతం జరిగిన దాడితో తనకు తీవ్ర ప్రాణభయం ఏర్పడిందని, భవిష్యత్తులో కూడా తనపై మరోసారి దాడి జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తన భద్రతపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి** తనపై దాడికి పాల్పడిన వ్యక్తులను గుర్తించి, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చక్రపాణి ఎస్పీని కోరారు. దాడికి గల కారణాలను కూడా విచారించి, తనకు భవిష్యత్తులో ఎలాంటి హాని జరగకుండా తగిన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఘటనపై విచారణ చేపట్టి, ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలపై వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది. దాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

# వైద్య చికిత్సకు రూ.2 లక్షల ఎల్ఓసీ అందజేత



**కురవి,ఆగస్టు,20(పి.సి.డబ్ల్యూ న్యూస్):**మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన మోటపోతుల రమేష్ వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీ ఎం ఆర్ ఎఫ్) ద్వారా మంజూరైన రూ. 2 లక్షల ఎల్ఓసీని హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆసుపత్రి అధికారులకు ప్రభుత్వ విప్,డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ ఆదేశాల మేరకు డోర్నకల్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొర్ని అనిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు,కాంగ్రెస్ నాయకులు అంగడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. మోటపోతుల రమేష్‌కు నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించేందుకు ఈ ఎల్ఓసీ ఎంతో ఉపయోగపడనుంది. పేద ప్రజలకు వైద్య చికిత్స విషయంలో అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఈ సహాయం మంజూరు చేసిన ప్రభుత్వ విప్, డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్ నాయక్ కి మోటపోతుల రమేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇళ్ల నిర్మాణాలు వెంటనే చేపట్టాలి: లబ్ధిదారులకు ఎమ్మెల్యే సూచన



**కరీంనగర్ ఆగస్టు 20(పిసి డబ్ల్యూ న్యూస్):** ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఏమాత్రం జాప్యం చేయకుండా వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని మానకొండూర్ ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. గురువారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో ఆయన మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చునూరు గ్రామానికి రెండో విడుతలో 11 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్టు చెప్పారు. లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు చేపట్టి నిర్ణీత గడువులోగా గృహప్రవేశాలు జరపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పచ్చునూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ రొంటాల లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కనకం అశోక్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బాలగోని మల్లయ్య, నాయకులు కుమార్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా అందించిన ఎమ్మెల్యే



**తిమ్మాపూర్ ఆగస్టు 20(పిసి డబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ హాస్టల్ దగ్గర జరిగిన విద్యుత్ ఘాతంతో మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి ట్రాన్స్ కో 5 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా అందించింది. గత ఏడాది ఏప్రిల్ 28న జరిగిన ఈ ప్రమాదంలో జగిత్యాల జిల్లా పెగడపెల్లి మండలానికి చెందిన హన్మండ్ల వికాస్ రెడ్డి అనే విద్యార్థి మరణించాడు. కాగా, ట్రాన్స్ కో ఇస్తున్న రూ.5 లక్షల చెక్కును గురువారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మృతుని తల్లిదండ్రులు హన్మండ్ల ప్రభాకర్ రెడ్డి,స్వప్నలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడూతూ వికాస్ రెడ్డి మృతితో ఆ కుటుంబం అనుభిస్తున్న బాధను తీర్చలేకపోయినా, ఇప్పుడు అందిస్తున్న ఐదు లక్షల సాయం వారి కుటుంబానికి కొంతమేర అండగా అండగా ఉంటుందన్నారు. విద్యుత్ ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. విద్యుత్ లైన్లు, విద్యుత్ స్తంభాలు, హాస్టళ్లు, పాఠశాలలు, విద్యార్థులు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉండటం, స్తంభాలు దెబ్బతినడం లేదా ఇతర సమస్యలు కనిపిస్తే వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో అల్గునూరు ఏడీ పి. లక్ష్మిపతి రాజు, ఏఈ వెంకటరెడ్డి, ముస్తలాపూర్ ప్యాక్స్ చైర్మన్ మోరపల్లి రమణారెడ్డి పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్త ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి జయప్రదం చేయండి

- ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేలు ఇవ్వాలి
- చలమాల విఠల్ రావు డిమాండ్



**పెనుబల్లి, ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :**స్థానిక వియం బంజర్ సెంటర్లో కొత్తగూడెం రోడ్డు ఆటో అడ్డాలో కార్మికుల సంబంధించి ఈ నెల 24 బందు జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జే పుల్లారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్రావు మాట్లాడుతూ ఈనెల 24వ తారీఖున జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర బందును జయప్రదం చేయాలని, ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి 12 వేల రూపాయలు ఇవ్వాలని, ఆర్టీసీ యాజమాన్యానికి ఎలక్ట్రికల్ ఆటోలు ఇవ్వాలనే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని, ఈ డిమాండ్స్ సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో 24 వ తారీకు జరిగే బందును జయప్రదం చేయలని పిలుపునిచ్చారు. రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు చిట్టి మొదల కృష్ణ, నల్లమల్ల అరుణ్ ప్రతాప్, ఆటో వర్కర్స్ యూనియన్ బాధ్యులు ఎస్కే బాజీ ఎం. విజయ్, వి. శ్రీనివాస్, ఆర్. వెంకటేశ్వరావు,జే. వెంకటేశ్వరరావు, మిద్దె శ్రీను, పూదూరి చంటి, నాగేశ్వరావు, ఆర్. సీతారాములు,పాల్గొన్నారు.

# కులవృత్తులే సమాజానికి పునాది

**ఆరేపల్లిలో ఎస్.ఆర్. ప్రైమ్ స్కూల్ విద్యార్థుల క్షేత్ర పర్యటనలో కార్పొరేటర్ బారి అపర్ణ జితేందర్...**



**కరీంనగర్ టౌన్ ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** "కులవృత్తులే సమాజానికి పునాది" అనే నినాదంతో కరీంనగర్ పట్టణం ఎస్.ఆర్. ప్రైమ్ స్కూల్ (జ్యోతి నగర్) నందలి 7, 8 తరగతుల విద్యార్థులు గురువారం రోజున క్షేత్ర పర్యటనలో భాగంగా ఆరేపల్లి నీ సందర్శించారు. పల్లె వాతావరణాన్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తూ విద్యార్థులు విజ్ఞానాన్ని సముపార్జించారు. ఆరేపల్లి లోని కుమ్మరివాడను సందర్శించిన విద్యార్థులు, మల్లేశం అనే కుమ్మరి వద్ద నుంచి స్వయంగా కుండలు తయారు చేయడంలో గల వివిధ ప్రక్రియలను దగ్గరుండి పరిశీలించి తెలుసుకున్నారు. అలాగే వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి, రైతుల ద్వారా పాడి పంటలకు సంబంధించిన అమూల్యమైన వ్యవసాయ జ్ఞానాన్ని ఆర్జించారు. పుస్తకాల్లో చదివిన అంశాలను ఇలా పల్లె వాతావరణంలో ప్రత్యక్షంగా చూడటం తమకెంతో ఆహ్లాదాన్ని, సరికొత్త అనుభూతిని కలిగించిందని విద్యార్థులు సంబరపడ్డారు. ఈ క్షేత్ర పర్యటనలో పాల్గొన్న ఆరేపల్లి 1వ డివిజన్ కార్పొరేటర్ బారి అపర్ణ జితేందర్ మాట్లాడుతూ... "కులవృత్తులే సమాజానికి పునాది" అని, విద్యార్థులు ఇలా ఆరేపల్లిని సందర్శించి సంస్కృతిని తెలుసుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు. పాఠశాల డీజీఎం సచిన్ ప్రోత్సాహంతో, పాఠశాల ఏఓ, కోఆర్డినేటర్ ఉపాధ్యాయుల సమక్షంలో ఈ క్షేత్ర పర్యటన విజయవంతంగా నిర్వహించబడింది. విజయవంతమైన క్షేత్ర పర్యటన పట్ల ఎస్.ఆర్. విద్యాసంస్థల చైర్మన్ వరదా రెడ్డి డైరెక్టర్ సంతోష్ రెడ్డి ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి విద్యార్థుల భవిష్యత్తు కోసం బీజేపీ పోరాటం: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్ ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన లి"ఫీజుల బకాయి బీజేపీ లడాయి"లి కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు గారితో కలిసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు రూ. 12 వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో అనేక మంది విద్యార్థులు తమ విద్యా సర్టిఫికెట్లు పొందలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మరోవైపు కాలేజీ యాజమాన్యాలకు ఫీజు బకాయిలు అందకపోవడంతో సిబ్బందికి జీతాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడి, కొన్ని విద్యాసంస్థలు మూసివేత అంచున ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని




కొనసాగిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. గల్లీ నుంచి అసెంబ్లీ వరకు విద్యార్థుల సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను పూర్తిగా విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. విద్యార్థులకు భరోసా కల్పించడంతో పాటు, ప్రభుత్వం మెడలు వంచేలా బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని అన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం ఆగదని, రాష్ట్ర ప్రభుత్వం




వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కుండె గణేష్ , జిల్లా ఇన్‌చార్జ్ శాంత కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, మాజీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంఘ నరేష్, మాజీ ఎమ్మెల్యే శోభక్క, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు తో పాటు కార్పొరేటర్లు, విద్యార్థులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

- యువతకు ఓటు హక్కు ఇచ్చిన మహనీయుడు రాజీవ్ గాంధీ - డా. మేడిపల్లి సత్యం
- కార్పొరేషన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువత కొత్త ఓటర్ నమోదు కార్యక్రమం
- రాజీవ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం - కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్
- కరీంనగర్ రాజీవ్ చౌక్ లో రాజీవ్ గాంధీకి ఘన నివాళులు







**కరీంనగర్, ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, ఆధునిక భారత నిర్మాత, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు కరీంనగర్ లోని రాజీవ్ చౌక్ లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం హాజరై కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వెలిచాల రాజేందర్ రావు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్, ఏఎంసీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పలువురు నేతలతో కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులు అర్పించి, రాజీవ్ గాంధీ సేవలను కొనియాడారు. అనంతరం టిపిసిసి ఆదేశాల మేరకు కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ గారు రాజీవ్ గాంధీ స్ఫూర్తితో ూ.×.= ప్రక్రియలో భాగంగా 18 ఏళ్లు నిండిన యువతకు కొత్త ఓటర్ నమోదు - ఫారం-6 నింపే కార్యక్రమాన్ని నిర్వహించగా డిసిసి మేడిపల్లి సత్యం 18 సంవత్సరాలు నిండిన యువతకు నూతన ఓటరు నమోదు ఫారం స్వయంగా పూరించి అందజేయడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి డా. మేడిపల్లి సత్యంతో పాటు పలువురు నేతలు మాట్లాడుతూ మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ గారి హత్యానంతరం ఈ దేశం ఒక మంచి నాయకత్వం కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఈ దేశాన్ని నడిపించగల సమర్థులైన నాయకులు రాహుల్ గాంధీ అని ప్రతి పౌరుడు విశ్వసించారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి పదవి చేపట్టి దేశంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టి ఐటీ రంగంతో పాటు టెలి కమ్యూనికేషన్ విభాగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి నేడు ప్రతి పేదవాడు సెల్ ఫోన్, కంప్యూటర్ వినియోగించడానికి పునాదులు వేసిన గొప్ప నాయకులు, గ్రామాలు దేశానికి వెన్నెముక కావాలని స్థానిక సంస్థలను బలోపేతం చేసిన నాయకులు, నాడు దేశంలో బ్రిటిష్ విద్యా విధానం కొనసాగుతుంటే రాజీవ్ గాంధీ సారధ్యంలో నూతన విద్యా విధానం పాలసీ తీసుకువచ్చి నేడు కార్పోరేట్ విద్యాలయాలను మించిన సకల సౌకర్యాలతో వేల మంది చదువుకుంటున్న జవహర్ నవోదయ విద్య అంకురార్పణ చేసినారు. ప్రధాని నరేంద్ర మోడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ విధానాల్లో భాగస్వామ్యం కోరుకుంటూ జెన్ జీ ఉద్యమాలు చేస్తున్న ఈ రోజుల్లో, ఆనాడే రాజీవ్ గాంధీ చట్ట సభలకు ఎన్నికయ్యే వ్యక్తులను ఎన్నిక చేసే బాధ్యతలో యువతను భాగస్వాములను చేయాలని 61 వ రాజ్యాంగ సవరణ చేసి 21 సంవత్సరాలకు ఉన్న యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన గొప్ప మేధావి. రాజకీయరంగంలో తనదైన ముద్ర వేసుకున్న రాజీవ్ గాంధీ చిన్న వయసులోనే తీవ్రవాదుల చేతుల్లో హత్యకు గురై దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసినారు. వారి మరణానంతరం సోనియా గాంధీ రాహుల్ గాంధీ ఈ దేశ ప్రజలకు మేమున్నాం అంటూ ఈ దేశ ప్రజలను, కాంగ్రెస్ పార్టీని కాపాడే బాధ్యత వహిస్తూ యుపిఏ చైర్ పర్సన్ గా ఎన్నో సంస్కరణలు చేపట్టినారు. ఈ దేశానికి దేశ ప్రజలకు సేవ చేసిన జవహర్లాల్ నెహ్రూ శ్రీమతి ఇందిరాగాంధీ రాజీవ్ గాంధీ కుటుంబాన్ని వారు చేసిన త్యాగాలను సూర్యచంద్రులు ఉన్నంతవరకు విదేశ ప్రజలు మరిచిపోరని రాజీవ్ గాంధీ తను చివరి శ్వాస వరకు ఏ ఆశయాల కోసం కలరుగన్నారు ఆ విషయాలను నెరవేర్చడానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులమైన మేమంతా పోరాడుతామని, ఆ మాటకు కట్టుబడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పురుమల్ల శ్రీనివాస్, రాచకొండ చక్రధర్ రావు, మడుపు మోహన్, వెన్న రాజ మల్లయ్య, పర్వత మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, మూల రవీందర్ రెడ్డి,ఇక్రమ్, ముస్తాక్ అహ్మద్, ముత్యం శంకర్ గౌడ్, మల్యాల సుజిత్ కుమార్, వెన్నం రజిత రెడ్డి, వంగల విద్యాసాగర్, మునిగంటి అనిల్, కామ్రెడ్డి రాంరెడ్డి,మామిడి సత్యనారాయణ రెడ్డి, చర్ల పద్మ, గుండాటి శ్రీనివాసరెడ్డి, చింతల కిషన్, లింగంపల్లి బాబు, పొన్నం మధు, మూల జైపాల్, అబ్దుల్ రహమాన్, అమీర్, ముక్క భాస్కర్, రాచర్ల పద్మ, ఇమ్రాన్, ఫహాద్, దన్ను సింగ్, ఇమ్రాన్ఘని, హైమద్, కంకణాల అనిల్ కుమార్, సలీముద్దీన్, కీర్తి కుమార్, రోళ్ళ సతీష్, కుంభాల రాజకుమార్, మాదాసు శ్రీనివాస్, కుర్ర పోచయ్య, బొబ్బిలి విక్టర్,తోట అంజయ్య, స్వప్నశ్రీ, కపిల్ మాధవ్, మంద మహేష్, షహేన్షా, శ్రీరాముల రమేష్, శిల్ప, లాయికు, సిరిపురం మనోజ్, కలీం, ఎస్ఏ మోసిన్, హాజీ, కిరణ్ రెడ్డి, కర్రే పావని, అబ్దుల్ బారి, వసీం, సత్తినేని శ్రీకాంత్, షబానా, సుంకరి గణపతి, బత్తిని చంద్రయ్య గౌడ్, హస్తపురం తిరుమల, వీర దేవేందర్, గడప అజయ్, చాంద్, రంగా నాయక్, ఫజల్, కోలా గాని అనిల్, బషీరుద్దీన్, కలీముద్దీన్, అశోక్ రెడ్డి, గంగుల దిలీప్, మిరాజ్, చెల్లోజు రాజు, పెంటశేఖర్, ఊకంటి రవీందర్ రెడ్డి, గడ్డం శ్రీరామ్, అందే శంకర్, నాగుల సతీష్, మార్కరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం కరీంనగర్‌లో కదం తొక్కిన విద్యార్థులు..

**బీజేవైఎం ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో భారీ 'స్టూడెంట్ మార్చ్'..**

**కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కార్ తెలంగాణలో అన్ని రంగాలను**

**నిర్వీర్యం చేసింది..! విద్యారంగాన్ని భ్రష్టు పట్టించింది...!?**

**12 వేల కోట్లు బకాయిలు చెల్లించకుండా**

**విద్యార్థుల జీవితాలతోచెలగాటమాడుతుంది.**

**బ్రిటిష్ వాళ్ళు స్థాపించిన కాంగ్రెస్ పార్టీకి దేశం పట్ల,**

**వందేమాతరం పట్ల గౌరవం లేదు..**

**పోలీసులు ప్రభుత్వానికి గులాములుగా మారకండి..**

**ఫీజుల బకాయి .. బిజెపి లడాయి ప్రోగ్రామ్స్ సందర్భంగా కరీంనగర్ కలెక్టరేట్ వద్ద బిజెపి స్టేట్ చీఫ్ రామచంద్రరావు వ్యాఖ్యలు...**

**కరీంనగర్ కలెక్టరేట్ వద్ద ఫీజుల బకాయి .. బిజెపి లడాయి ప్రోగ్రామ్స్ సందర్భంగా బీజేపీ స్టేట్ చీఫ్ రామచంద్రరావు వ్యాఖ్యలు**






**కరీంనగర్ ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** ఫీజు రియంబర్స్మెంట్ బకాయిల విడుదల కోసం కరీంనగర్ కళాశాల విద్యార్థులు బీజేవైఎం ఆధ్వర్యంలో కదం తొక్కారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు బీజేవైఎం నాయకులు, వందలాది మంది కళాశాల విద్యార్థులతో కలిసి భారీ ఎత్తున 'స్టూడెంట్ మార్చ్' నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఫీజుల బకాయి ... బిజెపి లడాయి ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులో జరుగుతున్న తీవ్ర తాత్సారంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువ డిక్లరేషన్ ను అటకెక్కించి, యువతను తీవ్రంగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ , ఈబీసీ వర్గాల విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, బకాయిలు సుమారు రూ. 12,000 కోట్ల చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతోచెలగాటమాడుతుందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, దీనివల్ల లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలు కోల్పోయి తీవ్ర గోస పడుతున్నారని తెలిపారు. "విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది ప్రభుత్వం ఇస్తున్న భిక్ష కాదు.. అది విద్యార్థుల హక్కు" అని స్పష్టం చేశారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయని, ముఖ్యంగా రాష్ట్రంలో విద్యా రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు.పోలీసులు ప్రభుత్వానికి గులాములుగా పనిచేయవద్దని, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలపై అంక్షలు పెట్టి ఆందోళనలను అడ్డుకోవాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ. 12,000 కోట్ల బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో విద్యార్థుల పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రామచందర్ రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.. బ్రిటిషర్లు స్థాపించిన కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి అధినేతగా వ్యవహరిస్తున్న విదేశీయురాలకు దేశం పట్ల, వందేమాతరం పట్ల గౌరవం ఎప్పటికీ ఉండదని ఘాటుగా విమర్శించారు.. అనంతరం బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ మాట్లాడుతూ స్టూడెంట్ మార్చ్ ప్రోగ్రాంకు సంబంధించిన విషయంలో పోలీసులు అతిగా ప్రవర్తించారని , విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలను నోటీసులతో బెదిరించే ప్రయత్నం చేశారని ఆయన ఆరోపించారు. పోలీసులు ప్రభుత్వానికి తొత్తులా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనని , పోలీసులు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించే వరకు కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విడిచి పెట్టే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ లు మాట్లాడుతూ రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తు, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందని ఆయన మండిపడ్డారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి నేడు అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ సర్కార్ నట్టేట ముంచిందన్నారు.ఈ కార్యక్రమం లో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ,రాష్ట్ర అధికార ప్రతినిధి,డిప్యూటీ మేయర్ యాదగిరి సునిల్ రావు,బిజెపి మాజీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, బాస సత్యనారాయణ రావు,కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ బొయినిపల్లి ప్రవీణ్ రావు,జిల్లా నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు, బిజేవైయం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి, బిజేవైయం జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్, బిజేవైయం నాయకులు ఎడవెల్లి శశిధర్ రెడ్డి,చిక్కుల కిరణ్,నక్క ప్రమోద్,గుర్రం వెంకటేష్ గౌడ్,రమేష్ యాదవ్,వెంకటసాయి, బద్దం రాహుల్ రెడ్డి, వినయ్,మణిదీప్,నాగరాజు, సందీప్,శ్రీకర్,రాజెందర్,సతీష్ బిజేవైయం నాయకులు మరియు కార్పోరేటర్లు,వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు బిజెపి జిల్లా నాయకులు,మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

---

## ప్రిన్సిపాల్ రూప రెడ్డి హత్యను ఖండిస్తూ నివాళులు అర్పించిన గంగాధర మండల ప్రైవేట్ పాఠశాలలు



**గంగాధర ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ లో ఈరోజు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున గ్రామర్ కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపాల్ కల్లు రూపారెడ్డి పై జరిగిన దారుణ హత్యను ఖండిస్తూ గంగాధర ప్రవేట్ పాఠశాలల యాజమాన్యం, సిబ్బంది నల్లభ్యాడ్జి లతో నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల, మధురనగర్ లోని సురభి కాన్వేంట్ హై స్కూల్, విన్నర్ ఎడ్జి హై స్కూల్, గర్శకుర్తి గ్రామం లోని సరస్వతి హై స్కూల్, గట్టుబుత్కూర్ లోని శ్రీ సాయి విద్యానికేతన్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం తీవ్రంగా ఖండించింది.. విద్యాబుద్ధులు నేర్పే గురువులపై, విద్యాసంస్థల అధినేతలపై ఇలాంటి కిరాతక దాడులు జరగడం సమాజానికే సిగ్గుచేటు.డబ్బు కోసం, జల్సాల కోసం మైనర్ విద్యార్థులే ఈ ఘాతుకానికి ఒడిగట్టడం విద్యావ్యవస్థను, సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. విద్యార్థులలో నైతిక విలువలు లోపించడం ఎంతటి ప్రమాదకరమో ఈ ఘటన నిరూపిస్తోందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం విద్యా రంగ భద్రత కోసం ప్రభుత్వాలు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గంగాధర మండల ప్రవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో కొవ్వత్తుల ర్యాలీ చేశారు. రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. పాఠశాలల టీచర్స్, యాజమాన్యం పాల్గొన్నారు.

---

## విద్య, వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట...

**సత్తుపల్లి మునిసిపల్ పరిధిలో**

**రూ.1.83 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**రూ.40 లక్షలతో కమ్యూనిటీ హాల్‌కి శంకుస్థాపన, రూ.1.43 కోట్లతో**

**అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభించిన మంత్రి**



**సత్తుపల్లి, ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్)** :ప్రజారోగ్యం, విద్యారంగాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో రూ. 1.83 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, పట్టణ పేదలకు నాణ్యమైన ఉచిత ప్రాథమిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఎన్టీఆర్ నగర్‌లో రూ. 1.43 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. హెల్త్ సెంటర్ కావాల్సిన వైద్యాధికారులు, సిబ్బంది నియామకానికి చర్యలు చేపడతామన్నారు. అలాగే శివసాయి నగర్‌లో రూ. 40 లక్షల నిధులతో నిర్మించనున్న మల్టీపర్పస్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల సామాజిక కార్యకలాపాలకు, శుభకార్యాలకు ఈ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పాల్గొన్నారు.

---

# 'యశోద'లో ఊపిరితిత్తులకు అత్యాధునిక శస్త్రచికిత్సలు

**సోమాజిగూడా యశోద ఆసుపత్రి ప్రముఖ**

**థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి**

**ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలకు**

**భయపడాల్సిన పనిలేదు**

**అత్యాధునిక శస్త్రచికిత్సలతో**

**విజయవంతంగా ఊపిరితిత్తుల మార్పిడి**

**యశోద ఆసుపత్రిలో పల్మనాలజీ, థొరాసిక్**

**లకు 24 గంటల సర్జరీ సేవలు**




**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ప్రస్తుతం అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ప్రమాదకరమనే అపోహను ప్రజలు వీడాలని సోమాజిగూడ యశోద ఆసుపత్రి ప్రముఖ థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో యశోద మెడికల్ సెంటర్ నందు గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... థొరాసిక్ సర్జరీ అంటే కేవలం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స కాదని, గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలను కార్డియో థొరాసిక్ సర్జరీగా పిలుస్తారని తెలిపారు. ఊపిరితిత్తులు, ఛాతీ భాగానికి సంబంధించిన శస్త్రచికిత్సలకు ప్రత్యేకంగా థొరాసిక్ సర్జరీ అనే విభాగం ఉందన్నారు. ముఖ్యంగా కోవిడ్ తర్వాత ఊపిరితిత్తుల వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు. ఊపిరితిత్తులకు సంబంధించిన అనేక సమస్యలకు ప్రస్తుతం ప్రత్యేక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. యశోద ఆసుపత్రి సోమాజిగూడలో పల్మనాలజీ, థొరాసిక్ సర్జరీ సేవలను 24 గంటలూ అందిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా ఊపిరితిత్తుల మార్పిడి (లంగ్ ట్రాన్స్‌ప్లాంట్) సేవలను కూడా ప్రారంభించామని, ఇప్పటికే విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించి పలువురు రోగులు కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు. ఎండ్ స్టేజ్ లంగ్ డిసీజ్‌తో బాధపడుతున్న వారికి ఊపిరితిత్తుల మార్పిడి కొత్త జీవితాన్ని అందించే అవకాశముందని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు. ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజెస్, ధూమపానం కారణంగా వచ్చే సీఓపీడీ వంటి వ్యాధుల్లో ఒక దశ తర్వాత ఊపిరితిత్తుల పనితీరు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాంటి రోగులు శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతూ, ఆయాసంతో జీవన్మరణ పరిస్థితిని ఎదుర్కొంటారని, వారికి లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. క్షయవ్యాధి కారణంగా ఊపిరితిత్తుల్లో కొంత భాగం దెబ్బతినడం, దగ్గులో రక్తం పడటం, ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి సమస్యలకు కూడా శస్త్రచికిత్స అవసరం కావచ్చని తెలిపారు. ప్రస్తుతం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఆధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు చేస్తున్నామని చెప్పారు. మినిమల్ ఇన్వేసివ్ థొరాసిక్ సర్జరీ ద్వారా చిన్న కోతలతోనే ఊపిరితిత్తుల్లోని వ్యాధిగ్రస్త భాగాన్ని తొలగించే అవకాశం ఉందన్నారు. సాధారణంగా ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల పరిమాణంలో చిన్న కోతలతో శస్త్రచికిత్స చేయడం వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. దీనికి మరింత ఆధునిక రూపంగా రోబోటిక్ థొరాసిక్ సర్జరీ అందుబాటులోకి వచ్చిందని, యశోద ఆసుపత్రిలో ఈ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గతంలో ఊపిరితిత్తుల శస్త్రచికిత్స అంటే చాలా ప్రమాదకరమని భావించి రోగులు భయపడేవారని, ప్రస్తుతం ఆధునిక వైద్య సాంకేతికతతో ఈ శస్త్రచికిత్సలు సురక్షితంగా నిర్వహించగలుగుతున్నామని డాక్టర్ రోహన్ రెడ్డి పేర్కొన్నారు, సూర్యాపేట, ఖమ్మం ప్రాంతాల నుంచి కూడా పలువురు రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఉంటే భయపడకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల్లో ఎవరికైనా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు ఉంటే ఈ సమాచారాన్ని వారికి చేరవేయాలని మీడియా ప్రతినిధులను కోరారు.ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ఇకపై భయపడాల్సినంత ప్రమాదకరమైనవి కావు. ఆధునిక మినిమల్ ఇన్వేసివ్, రోబోటిక్ థొరాసిక్ సర్జరీలతో సురక్షితంగా చికిత్స అందించవచ్చు. అవసరమైన రోగులకు లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ కూడా సాధ్యమే. సరైన సమయంలో నిపుణులను సంప్రదిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చు" అని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో యశోదా ఆసుపత్రి సీనియర్ మేనేజర్ శ్రీధర్, అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

---

## రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని అరటి పండ్లు పంచిన అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి







**కరీంనగర్ జిల్లా ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా, వీణవంక మండలం, మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి మరియు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాంస్కృతిక సేన కరీంనగర్ జిల్లా కళాకారుల సంయుక్త నిర్వాహణలో రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకొని వీణవంక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రం పిల్లలకు, మరియు ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని సుమారు 200 మంది విద్యార్థిని, విద్యార్థులకు అరటిపండ్లు పంపిణీ చేసినారు. అనంతరం గోనెల సమ్మన్న ముదిరాజ్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ భారత దేశ ప్రధానిగా ఎనలేని సేవలు చేసి, దేశం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసినారని ఈ సందర్భంగా వారి సేవలను గుర్తు చేసుకుంటు వారికి ఘనమైన నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సాంస్కృతిక సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, టీపీసీసీ సాంస్కృతిక సేన హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్,సింగర్ పొట్టాల శివకుమార్, అమ్మ ఫౌండేషన్ సభ్యులు గోనెల రుశికేష్(బన్నీ), రాయణవేణి సాత్విక్, నిమ్మల శివమణి(మల్లన్న) మరియు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం..

**బేతుపల్లి రెవెన్యూ గ్రామంలో ఇప్పటికే 6 వేల ఎకరాల భూ రీ సర్వే పూర్తి**

**రీ సర్వేలో రైతుల అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే తుది హక్కుల నమోదు**

**వ్యవసాయ భూములకు వెళ్లే దారులను పరిరక్షించాలి.. దారులకు పట్టాలు ఇవ్వొద్దు**

**చెరువులను పరిరక్షించి అవసరమైన హద్దులు, రక్షణ చర్యలు చేపట్టాలి**

**రీ సర్వే అనంతరం 30 రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ.. ఆ తర్వాత ఆధార్ తరహాలో భూధార్ కార్డులు**

**వచ్చే ఏడాదిన్నరలో వ్యవసాయ భూములు, ఆబాది ఆస్తుల రీ సర్వే పూర్తి**

**అక్రమంగా 22ఏ భూముల క్రమబద్ధీకరణకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు**

**రాష్ట్రంలో భూ సమస్యలు లేని పరిస్థితి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం**

**నారాయణపురంలో రైతులతో ముఖా ముఖి, ప్రత్యేక అవగాహన సదస్సులో పాల్గొన్న మంత్రి**





**సత్తుపల్లి, ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలోని రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే భూభారతి చట్టం లక్ష్యమని, రైతుల భూ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి, నిజాయితీతో పనిచేస్తోందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.గురువారం సత్తుపల్లి మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో కడాస్ట్రల్, నాన్-కడాస్ట్రల్ గ్రామాల భూ రీ సర్వేపై నిర్వహించిన రైతుల ముఖాముఖి, ప్రత్యేక అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు.బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని భేతుపల్లి, రామానగరం, తాళ్లమడ, గంగారం, నారాయణపురం, రామగోవిందపురం, పాకాలగూడెం గ్రామాల పంచాయతీ ప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భూ రీ సర్వే ప్రక్రియ, భూ హక్కుల నమోదుపై తమకు ఉన్న సందేహాలు, సమస్యలను రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ భేతుపల్లి రెవెన్యూ గ్రామంలో గత 25 రోజులుగా సుమారు 6 వేల ఎకరాల భూ రీ సర్వే నిర్వహించినట్లు తెలిపారు. భేతుపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 12,047 ఎకరాల భూమి ఉందని, మొత్తం భూమికి రీ సర్వే నిర్వహిస్తున్నా మని చెప్పారు. మిగిలిన మరో 6 వేల ఎకరాల భూమికి కూడా రీ సర్వే పూర్తి చేస్తామని తెలిపారు.రీ సర్వే సందర్భంగా రైతులకు ఏవైనా అభ్యంతరాలు, సందేహాలు లేదా లోపాలు కనిపిస్తే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు. రీ సర్వేలో ఏదైనా తప్పు జరిగితే రైతులు ఆ విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే సరిదిద్దేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రీ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని స్పష్టం చేశారు.వ్యవసాయ భూములకు వెళ్లే దారులు తప్పనిసరిగా ఉండేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పొలాలకు వెళ్లే దారులకు పట్టాలు ఇవ్వొద్దని, దారులను రైతుల భూముల్లో భాగంగా నమోదు చేయొద్దని స్పష్టం చేశారు. రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేలా అవసరమైన అప్రోచ్ రోడ్లు, దారులను పరిరక్షించాలని సూచించారు.చెరువులను తప్పనిసరిగా పరిరక్షించాలని మంత్రి అన్నారు. చెరువులకు అవసరమైన హద్దులు, రక్షణ చర్యలు, కాంపౌండ్ నిర్మాణం వంటి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సరిహద్దులను కూడా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. చెరువులను పరిరక్షిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు.భేతుపల్లి రెవెన్యూ గ్రామంలో మొత్తం 12,047 ఎకరాల భూమి ఉండగా, సుమారు 2,026 ఎకరాలు అసైన్డ్ భూములుగా ఉన్నాయని ఇందులో సుమారు 980 ఎకరాలను పేదలకు అందించినట్లు చెప్పారు. ఇంకా సుమారు వెయ్యి ఎకరాల అసైన్డ్ భూముల్లో కొంతమంది రైతులు సాగు చేస్తున్నప్పటికీ వారికి పట్టాలు లేవని వివరించారు.అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలు ఎక్కడా కోల్పోవని మంత్రి స్పష్టం చేశారు. అర్హులైన రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులకు భూమిపై హక్కులు కల్పించే ప్రక్రియలో నిబంధనలకు అనుగుణంగా అన్ని అంశాలను పరిశీలిస్తామని చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో నిజంగా భూమిపై ఉన్న రైతులకు హక్కులు దక్కలేదని మంత్రి అన్నారు. భూములు లేని కొంతమందికి కూడా రైతుబంధు ప్రయోజనాలు అందిన పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు.నాగార్జునసాగర్ పైలట్ ప్రాజెక్టు పరిధిలో నిర్వహించిన సర్వేలో సుమారు 3,400 వరకు నకిలీగా గుర్తించిన పట్టాదారు పాస్ బుక్‌లు బయటపడ్డాయని చెప్పారు. భూమి రైతులకు అత్యంత భావోద్వేగంతో కూడుకున్న అంశమని, ఇది రాజకీయ అంశం కాదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. నిజమైన రైతులకు భూ హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.బేతుపల్లి గ్రామం తనకు కొత్త కాదని మంత్రి అన్నారు. గ్రామంలోని భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు కూడా గ్రామంలోని సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భూ రీ సర్వే నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతి రైతు భూమికి ఖచ్చితమైన కోఆర్డినేట్లు, మ్యాప్ రూపొందించి, భూ హక్కులను నమోదు చేస్తామని చెప్పారు. రైతులు తుది టైటిల్స్ కోసం ఎదురుచూస్తున్నారని, రీ సర్వే పూర్తయిన తర్వాత ప్రక్రియను నిబంధనల మేరకు పూర్తి చేసి తుది హక్కులు అందజేస్తామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా భూ రీ సర్వే మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి చేపట్టినట్లు మంత్రి వెల్లడించారు. వచ్చే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములతో పాటు ఆబాది ఆస్తుల రీ సర్వేను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.రీ సర్వే పూర్తయిన తర్వాత 30 రోజుల పాటు రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తామని మంత్రి తెలిపారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, పరిష్కరించిన తర్వాతే తుది హక్కులను నమోదు చేస్తామని చెప్పారు. మనుషులకు ఆధార్ కార్డులు ఉన్నట్లుగా రైతుల భూములకు కూడా భూధార్ కార్డులు అందజేస్తామని తెలిపారు.రీ సర్వేలో ప్రతిరోజూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం భేతుపల్లిలో కూడా ఇదే విధానంలో రీ సర్వే జరుగుతోందని తెలిపారు. రీ సర్వే సమయంలో కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, రైతులు వాటిని అధికారుల దృష్టికి తీసుకువస్తే సరిచేసి తుది ప్రక్రియలో చేర్చుతామని అన్నారు. భూభారతి చట్టాన్ని తమ ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం తీసుకువచ్చిందని, చిత్తశుద్ధి, నిజాయితీతో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజలకు, రైతులకు తమ ప్రభుత్వ చిత్తశుద్ధి, నిజాయితీ ఏమిటో తెలుసని అన్నారు.గత ప్రభుత్వం ధరణికి సంబంధించి నిబంధనలు కూడా పూర్తిస్థాయిలో రూపొందించలేదని మంత్రి విమర్శించారు. భూభారతి చట్టానికి మాత్రం కేవలం మూడు నెలల్లోనే నిబంధనలు రూపొందించినట్లు తెలిపారు.భూభారతిచట్టం రైతులకు ఉపయోగపడేలా పనిచేస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా తాను పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నానని చెప్పారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రజలు త్వరలోనే వారికి మరోసారి బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.రైతులే తమకు అత్యంత ముఖ్యమని, రాష్ట్రంలో భూ సమస్యలు లేకుండా చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రతిపక్షాలు ప్రజలను రెచ్చగొట్టి సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేసినా తాము పట్టించుకో బోమని మంత్రి అన్నారు. భూభారతి చట్టం రైతులకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి క్షేత్రస్థాయిలో అమలును పరిశీలిస్తానని చెప్పారు.భూభారతి చట్టం రాబోయే ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి ప్రజల తీర్పుకు రెఫరెండంగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని అన్నారు.కొంతమంది భూ ఆక్రమణదారులు అమాయక ప్రజలను అడ్డుపెట్టుకుని 22ఏ భూములను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి ఇలాంటి ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే వారిపై చర్యలు ప్రారంభించామని తెలిపారు.సామాన్య ప్రజలను ముందు పెట్టి అక్రమంగా దోచుకున్న భూములను రెగ్యులరైజ్ చేసుకునేందుకు చేసే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలించబోవని మంత్రి స్పష్టం చేశారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలో పనిచేసి రైతుల భూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రతి భూ సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.స్థానిక నాయకులు దయానంద్ మాట్లాడుతూ ధరణి కారణంగా అనేక మంది రైతులు భూ సమస్యలను ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సత్తుపల్లి ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు. ప్రతి రోజూ సుమారు 200 నుంచి 300 ఎకరాల వరకు భూ రీ సర్వే జరుగుతోందని, ఇప్పటి వరకు సుమారు 6 వేల ఎకరాల సర్వే పూర్తయిందని తెలిపారు. భవిష్యత్తులో మరో 6 వేల ఎకరాల భూమికి సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు.ధరణి సమయంలో భూములు లేని కొంత మంది కూడా నకిలీ పట్టాదారు పాస్‌బుక్‌లు పొందినట్లు గుర్తించామని, అర్హత లేని పాస్‌బుక్‌లను రద్దు చేసి వాటి ఆధారంగా పొందిన రైతుబంధు మొత్తాలను రికవరీ చేయాలని దయానంద్ కోరారు. భూ రీ సర్వేలో రైతులు రెవెన్యూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు.రైతులు మాట్లాడుతూ భూ రీ సర్వే పారదర్శకంగా జరుగుతోందని తెలిపారు. పొరుగు రైతుల సమ్మతితోనే భూముల హద్దులను నిర్ణయిస్తున్నారని చెప్పారు. భూములు ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఉండటంతో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్‌బుక్‌లు జారీ చేసి సమస్యను పరిష్కరించాలని రైతులు మంత్రిని కోరారు. యెనుకట్లలోని 33 ఎకరాల చెరువును కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. చెరువును పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, చెరువును రక్షిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. పొలాలకు వెళ్లే దారుల కోసం కొంతమంది సర్వే చేస్తున్నారని, ఆ దారులను పట్టాదారు పాస్‌బుక్‌లో భూమిగా నమోదు చేయకుండా చూడాలని కోరారు.కిష్టాపురం గ్రామంలోని సర్వే నంబర్ 263లో 721 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా, 811 ఎకరాలు పంపిణీ చేసినట్లు నమోదైందని రైతులు తెలిపారు. 90 ఎకరాల అదనపు కేటాయింపుపై విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డీఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, విద్యుత్ శాఖ ఎస్ ఇ శ్రీనివాస చారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి స్థలంకోసం జర్నలిస్టుల మహా పాదయాత్ర

**అమర జర్నలిస్టు షోయబుల్లాఖాన్ స్ఫూర్తితో ఆగస్టు 22న సుబ్లేడు నుంచి శ్రీకారం**

**ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలే లక్ష్యం..**

**యూనియన్ లు, రాజకీయాలకు అతీతంగా జర్నలిస్టుల ఐక్య పోరాటం**

**తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి**




**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజల కన్నీళ్లను అక్షరాలుగా మార్చే జర్నలిస్టుల కళ్లలో మాత్రం సొంతింటి కల నేటికీ తీరని వేదనగా మిగిలింది. సమాజం కోసం నిరంతరం గొంతుకగా నిలిచే జర్నలిస్టులు.. చాలీచాలని ఆదాయాలతో అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తూ, ఎన్నో ఏళ్లుగా సొంత గూడు కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చాలన్న ఆకాంక్షతో ఇప్పుడు జర్నలిస్టులు హక్కుల బాట పట్టనున్నారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సాధన కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్‌హెచ్ 2843) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 22 శనివారం నుంచి పాదయాత్ర చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి లు తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కలంతో, గళంతో పోరాడి అమరుడైన జర్నలిస్టు షోయబుల్లాఖాన్ వర్ధంతి రోజున, ఆయన స్వస్థలం తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలోని విగ్రహం వద్ద నుంచి ఈ పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ప్రజల కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన షోయబుల్లాఖాన్ స్ఫూర్తితో.. నేటి జర్నలిస్టుల హక్కుల కోసం శాంతియుతంగా ఈ యాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు.

**అద్దె ఇంటి బాధ నుంచి.. సొంతింటి కల వైపు**

రెండున్నర దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలు, పెరుగుతున్న జీవన వ్యయాలు, ఆర్థిక ఇబ్బందుల మధ్య జర్నలిస్టులు కుటుంబాలను నెట్టుకొస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులే సొంతింటి కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. గతంలోనూ, ప్రస్తుతం కూడా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కల్పిస్తామని ప్రభుత్వాలు హామీలు ఇచ్చాయని, అయితే ఆ హామీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఆచరణకు నోచుకోలేదని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను గుర్తుచేసి, జర్నలిస్టుల న్యాయమైన హక్కును సాధించడమే ఈ పాదయాత్ర ప్రధాన ఉద్దేశమన్నారు. ఈ యాత్ర ఏ రాజకీయ పార్టీకి, ఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో సాగించే హక్కుల ఉద్యమమని తెలిపారు. పాదయాత్రను రాజకీయ కోణంలో చూడటం సరికాదన్నారు.

**మండల కేంద్రాల మీదుగా.. తహాశీల్దార్లకు వినతులు**

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సుమారు 15 రోజులపాటు ఈ పాదయాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఆగస్టు 22న సుబ్లేడు నుంచి ప్రారంభమై తిరుమలాయపాలెం మండల కేంద్రానికి చేరుకున్న అనంతరం కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ మండల కేంద్రాల్లో పాదయాత్ర కొనసాగుతుందని వివరించారు. ఆయా మండల కేంద్రాల్లో తహాశీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు జర్నలిస్టులతో సభలు నిర్వహిస్తామని తెలిపారు. తదుపరి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలోని మండల కేంద్రాల్లో పాదయాత్ర నిర్వహించి జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తూనే పరిస్థితులకు అనుగుణంగా విరామాలు తీసుకుంటూ యాత్రను కొనసాగిస్తామని తెలిపారు.

**యూనియన్లకు అతీతంగా.. జర్నలిస్టులంతా ఒక్కటిగా తరలాలి**

ఇండ్ల స్థలాల సమస్య ఏ ఒక్క యూనియన్‌కు సంబంధించినది కాదని, జర్నలిస్టులందరి సమస్య అని నాయకులు స్పష్టం చేశారు. యూనియన్‌లు, రాజకీయాలకు అతీతంగా ప్రతి జర్నలిస్టు ఈ పాదయాత్రలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ న్యాయమైన డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. “ప్రజల హక్కుల కోసం ప్రతిరోజూ ప్రశ్నించే కలాలకు.. సొంత గూడు కూడా హక్కే. జర్నలిస్టులకు ఇచ్చిన హామీని ఇక ఆలస్యం చేయకుండా ప్రభుత్వం అమలు చేయాలి” అని వారు స్పష్టం చేశారు. ఈ పాదయాత్రను విజయవంతం చేసి జర్నలిస్టుల ఐక్యతను చాటాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దగ్గుబాటి మాధవరావు, స్టేట్ ఈసీ మెంబర్ టీఎస్ చక్రవర్తి, సీనియర్ జర్నలిస్టు నాగేందర్ రెడ్డి, టీబీజేఏ జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు జానీపాషా, ఖమ్మం నియోజకవర్గ కార్యదర్శి గరిడేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల సాధన కోసం పెన్షనర్ల ఆక్రందన

**27న పెన్షనర్ల జేపీసీ మహాధర్నాను జయప్రదం చేయండి**

**రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు**




**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 20 (పిసిడబ్ల్యూ న్యూస్) :** జీవితమంతా ప్రభుత్వానికే ధారపోసి, విశ్రాంత జీవనంలో ప్రశాంతంగా గడపాల్సిన రిటైర్డ్ ఉద్యోగులు నేడు తమ న్యాయమైన హక్కుల కోసం మళ్లీ పోరాటబాట పట్టాల్సి రావడం గుండెను పిండేసే నిజం. దశాబ్దాల సేవకు ప్రతిఫలంగా అందాల్సిన పిఆర్సి బకాయిలు, డిఏ లు అందక, అనారోగ్య సమయాల్లో ఆసరాగా నిలవాల్సిన హెల్త్ కార్డులు ఆచరణకు నోచుకోక వేలాదిమంది పింఛనుదారులు తీవ్ర ఆర్థిక, మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 27న ఖమ్మంలో మహాధర్నాతో తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 27న ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రతి నెలా వేతనం నుంచి 1.5% మినహాయించుకుంటున్నా నేటికీ హెల్త్ కార్డులు జారీ చేయకపోవడం దారుణమని, విశ్రాంత ఉద్యోగుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనమని వారు వాపోయారు. పిఆర్సి కమిటీ నివేదికను తక్షణమే బహిర్గతం చేయడం, నిలిచిపోయిన డిఏలను వెంటనే విడుదల చేయడం, రిటైర్మెంట్ బకాయిలను ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఆగస్టు 27న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాతో పాటు, సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి నిరసన కార్యక్రమంలో కూడా పెన్షనర్లు భాగస్వాములు కావాలన్నారు.వయోభారాన్ని కూడా పక్కనపెట్టి తమ ఉనికి, ఆత్మగౌరవం కోసం ఉద్యమిస్తున్న ఈ సమైక్య పోరాటంలో ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు వేలాదిగా పెన్షనర్లు తరలిరావాలని నాయకులు కోరారు. జీవిత చరమాంకంలో ఉన్న పెన్షనర్ల వేదనను ప్రభుత్వం సానుభూతితో అర్థం చేసుకుని, ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వై వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఆర్ వెంకటనారాయణ, ఎస్ పూర్ణచందర్రావు, టీ జనార్ధన్, కాజా మొయినుద్దీన్, పి కొండలరావు, ఎం సీతారామయ్య, సిహెచ్ శ్రీనివాస్, డి రమేష్, రమణ యాదవ్ తోపాటు నగర నాయకులు తదితర నాయకులు పాల్గొన్నారు.

# కోతిరాంపూర్, చింతకుంటలో ఘనంగా తీజ్ ఉత్సవాలు..

**తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**





**కరీంనగర్ టౌన్ ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని కోతిరాంపూర్ మరియు చింతకుంట ప్రాంతాల్లో బంజారా మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించిన తీజ్ ఉత్సవాల్లో పాల్గొని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, బంజారా సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తీజ్ ఉత్సవాలు మహిళల్లో ఐక్యత, సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఉత్సవాల్లో బంజారా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ దుస్తులు ధరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, కార్పొరేటర్లు మాసం గణేష్, ఏపీపీ చంద్ర,బండ రమణారెడ్డి ,తోట అనిల్ ,గాజా రమా శివరాం, ఎన్నం లక్ష్మీ ప్రకాష్, కర్ర పద్మ అనిల్, దేవసాని సరస్వతి సత్యనారాయణ, విప్పల సాయి జ్యోతి, గడ్డి ప్రదీప్,తదితరులు పాల్గొన్నారు.

# వ్యసన రహిత భారత్ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి



**ప్రొద్దుటూరు ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** వ్యసన రహిత భారత్‌ను నిర్మించి, భారత్‌ను విశ్వగురువుగా నిలపాలని ఓంశాంతి భవన్ నిర్వాహకులు బీకే శాంత పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్యంగా భారత ప్రభుత్వ శాఖలతో సంయుక్తంగా బ్రహ్మకుమారీస్ నిర్వహిస్తున్న నశాముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం రాజుపాలెంలోని శివప్రియ హైస్కూల్‌లో నిర్వహిం చారు. ఈ సందర్భంగా నిర్వహించిన 10 కోట్ల మాదకద్రవ్య రహిత ప్రతిజ్ఞ కార్యక్రమంలో బీకే శాంత మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో యువత సోషల్ మీడియా, డిజిటల్ మీడియాతో పాటు డ్రగ్స్, మద్యం, సిగరెట్ల వంటి వ్యసనాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మాదకద్రవ్యాలకు అలవాటుపడితే వ్యక్తి కెరీర్‌తో పాటు కుటుంబం, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని, చివరకు ఏకాకితనం మిగిలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆరోగ్యకరమైన విలువలతో కూడిన వికసిత్ భారత్, వ్యసన రహిత భారత్ నిర్మాణంలో యువత ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. బీకే సౌజన్య మాట్లాడుతూ..వ్యసన రహిత భారత్ కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించడంతో పాటు,మానసిక స్థైర్యం, స్వీయ క్రమశిక్షణ పెంపొందించేందుకు రాజయోగ ధ్యాన సాధన చేయించినట్లు తెలిపారు. దేశంలోని విద్యార్థులు, యువత బంగారు భవిష్యత్తును మాదకద్రవ్యాలు నాశనం చేస్తున్నాయని, 2025 గణాంకాల ప్రకారం 25 ఏళ్లలోపే యువతలో మాదకద్రవ్యాల బానిసత్వం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. రాజుపాలెం మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ రామస్వామి రెడ్డి మాట్లాడుతూ.. వ్యసన రహిత భారత్‌ను నిర్మించడం ద్వారా భారత్‌ను విశ్వగురువుగా నిలపడం యువత చేతుల్లోనే ఉందన్నారు. వ్యసనాల కారణంగా ఎంతోమంది తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని తెలిపారు. గతంలో ఆర్థికంగా ఉన్నవారికే పరిమితమైన డ్రగ్స్ ప్రస్తుతం అందరికీ అందుబాటులోకి రావడం ఆందోళనకరమన్నారు. ఎవరైనా ఒత్తిడి చేసినా మాదకద్రవ్యాలను తీసుకోవద్దని, నిగ్రహంతో వ్యవహరించాలని విద్యార్థులకు సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటే ప్రశాంతమైన జీవితాన్ని గడపడమే కాకుండా తమ లక్ష్యాలను సులభంగా చేరుకోగలరని, కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధికి కూడా తోడ్పడగలరని రామస్వామి రెడ్డి పేర్కొన్నారు. దేశ భద్రత, అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ వీరారెడ్డి మాట్లాడుతూ.. వ్యసనాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. సెల్‌ఫోన్, టీవీ వంటి వాటిని అధికంగా వినియోగించడం కూడా ఒక రకమైన వ్యసనమేనని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ, తాము మాత్రమే వ్యసనాలకు దూరంగా ఉండకుండా తమ స్నేహితులు, కుటుంబ సభ్యులను కూడా వ్యసనాలకు దూరంగా ఉండేలా ప్రోత్సహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఓంశాంతి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


# ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ఆద్యుడు రాజీవ్ గాంధీ

- **18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత ఆయనదే: మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు**



**కర్నూలు ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశంలో సమాచార సాంకేతిక రంగానికి బాటలు వేసిన నాయకుడని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం. సుధాకర్ బాబు అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు.విద్యా రంగంలో నూతన జాతీయ విద్యా విధానం, నవోదయ పాఠశాలలు, ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ వంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించారని పేర్కొన్నారు.దేశంలో సాంకేతిక, పారిశ్రామిక, రక్షణ, విమానయాన, వాణిజ్య రంగాల అభివృద్ధికి రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయాలు కీలకంగా నిలిచాయని సుధాకర్ బాబు అన్నారు. ఆయన చేసిన సేవలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.అనంతరం పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. సి.క్యాంప్ సెంటర్‌లోని రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ ఎన్.సి. బజారన్న, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి. బతుకన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత, ఎస్సీ సెల్ మాజీ జిల్లా చైర్మన్ ఈ. లాజరస్, బి. సుబ్రహ్మణ్యం, డబ్ల్యూ. సత్యరాజు, ఐఎన్‌టీయూసీ సిటీ అధ్యక్షులు ఆర్. ప్రతాప్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.


# ఏఈఈ ఉద్యోగ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



**కర్నూలు ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) ఉద్యోగాల భర్తీకి నిర్వహించనున్న పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 23 నుంచి 27వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 1.28 లక్షల మంది, కర్నూలు జిల్లాలో 4,982 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.ఏపీఎస్పీడీసీఎల్, సీపీసీఎల్, ఈపీడీసీఎల్, జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల్లోని 630 పోస్టుల భర్తీకి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నిరంతర విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ విద్యుత్ ఏర్పాట్లు చేయాలని సూచించారు.అభ్యర్థుల కోసం హెల్త్ డెస్కులు ఏర్పాటు చేయాలని, రవాణా సౌకర్యాలను సమన్వయం చేయాలని అధికారులను ఆదేశించారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.సమావేశంలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ప్రదీప్ కుమార్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, సంబంధిత శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సీమ కోసమా? చెన్నై కోసమా?

- **అనుమతులు లేకుండానే రూ.3,800 కోట్ల ప్రజాధనం వృథా**
- **రాయలసీమ లిఫ్ట్‌పై గత పాలకుల నిర్లక్ష్యం**
- **మండలిలో ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి ఆగ్రహం**



**అమరావతి/పులివెందుల ఆగస్టు 20(పిసిడబ్ల్యూ న్యూస్):** రాయలసీమ ఎత్తిపోతల పథకం అసలు రాయలసీమ రైతుల సాగునీటి అవసరాల కోసమా లేక చెన్నై తాగునీటి కోసమా అని శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. శాసనమండలి సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.గత పాలకులు ఎలాంటి పర్యావరణ అనుమతులు (ఎన్విరాన్మెంట్ క్లియరెన్సెస్ ),కేంద్ర జలవనరుల సంఘం (సిడబ్ల్యుసి) అనుమతులు తీసుకోకుండానే 2020లో దాదాపు రూ.3,800 కోట్ల ప్రజాధనంతో రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించారని గుర్తుచేశారు.పనులు మొదలైన కొద్ది నెలల్లోనే (అక్టోబర్ 2020లో) నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) స్టే విధించినప్పటికీ,ఆ స్టే ఎత్తివేతకు కనీస ప్రయత్నాలు చేయలేదని ఆరోపించారు.పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర 'పరివేశ్' పోర్టల్‌లో 2024 జూన్ వరకు సంబంధిత పత్రాలను సైతం అప్‌లోడ్ చేయలేదని విమర్శించారు.గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 364ను ప్రస్తావిస్తూ అందులో రాయలసీమ సాగునీటి కంటే చెన్నై తాగునీటి అవసరాల కోసమే ప్రాజెక్టును ప్రస్తావించారని ఎమ్మెల్సీ సభ దృష్టికి తెచ్చారు.గతంలో ఎన్టీ రామారావు హయాంలో తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి తాగునీరు అందించేందుకు తమిళనాడు ప్రభుత్వం ప్రాజెక్టు ఖర్చులో సగం భరించిందని,కానీ గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఏపీ ప్రజల సొమ్ము రూ.3,800 కోట్లను ఏ ప్రాతిపదికన ఖర్చు చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రాయలసీమ ప్రజల ప్రయోజనాలను గాలికొదిలేసి,ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు.